## సేవా పక్షాన్ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరావు

**అంబర్‌పేట:** పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. సోమవారం గోల్నాక డివిజన్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో సేవా పక్షంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సెప్టెంబరు 17ను పురస్కరించుకుని 15 రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే నెల అక్టోబరు 2వ తేదీ వరకు వివిధ రూపాల్లో ప్రజావసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులకు మూల రవీందర్‌గౌడ్, నర్సింగ్‌రావు యాదవ్, ఈశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు



**అంబర్‌పేట:** ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రెండో దఫా బాధ్యతలు వచ్చినందుకు ఆనంద్‌గౌడ్ సోమవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో కలిసి పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని అన్నారు. తనపై విశ్వాసంతో రెండోసారి ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు ఆనందంగా ఉందన్నారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తానన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి


క్రికెట్ కిట్‌లను అందజేస్తున్న వీహెచ్

**అంబర్‌పేట:** అంబర్‌పేట క్రికెట్ క్లబ్ క్రీడాకారులు ఇండియా టీమ్‌కు ఆడేలా ఎదగాలని మాజీ ఎంపీ వీ.హనుమంతారావు ఆకాంక్షించారు. హెచ్‌సీఏకు అనుబంధంగా ఉన్న అంబర్‌పేట క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు సోమవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో క్రికెట్ కిట్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న క్రికెటర్లను అంబర్‌పేట క్లబ్ ప్రోత్సహిస్తోందని అన్నారు. హైదరాబాద్ నుంచి ప్రతిభ ఉన్న క్రికెట్ క్రీడాకారులను ఇండియా టీం అందించేందుకు చొరవ తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట క్రికెట్ క్లబ్ ప్రతినిధులు పి.జ్ఞానేశ్వర్, సద్గురు, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

## దేవీశరన్నవరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



**అంబర్‌పేట:** దేవీ శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గోల్నాక దుర్గానగర్ అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలు ఇక్కడి ఆలయంలో కనుల పండువగా నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎనుగంటి నరేందర్, ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, శంకర్, రమణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సంగీత విభావరి

**చిక్కడపల్లి:** భానుమతి రామకృష్ణ శతజయంతిని పురస్కరించుకొని సోమవారం భానుమతి సినీ సౌరభాలు శీర్షికతో సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా భానుమతి సినిమాల్లోని పాటలను గాయకులు శ్రవణానందంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ గాయని వీకే.దుర్గను భానుమతి పురస్కారంతో పాటు స్వర విపంచి బిరుదును ప్రదానం చేశారు. కళావిపంచి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు రామారావు, లంకా లక్ష్మీనారాయణ, మహ్మద్ రఫీ, నరసింహారావు, స్వరకల్యాణి, మల్లికార్జునరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'లక్ష్మణరేఖ' చిత్ర బృందానికి సన్మానం

**చిక్కడపల్లి:** లక్ష్మణరేఖ విడుదలై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సినిమా హీరో మురళీమోహన్, హీరోయిన్ జయసుధతో పాటు నిర్మాత, దర్శకుడు లక్ష్మణరేఖ గోపాలకృష్ణను సోమవారం సన్మానించారు. ఇట్క్లా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ కె.ధర్మారావు ఈ సందర్భంగా వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సినీనిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# ఎప్పటికైనా ప్రమాదమే..!

• ప్రమాదకరంగా మారిన చెట్టు • వివేక్‌నగర్ బస్తీవాసుల ఆందోళన

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్ బస్తీలో సుమారు 30 ఏళ్ల నుంచి ఉన్న ఈ భారీ వృక్షం కింద భాగం అంత పుచ్చిపోయి ఎప్పుడు పడుతుందోనని బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నివాసాలపై కూలితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు వచ్చి పోతున్నారే తప్ప ఈ భారీ వృక్షాన్ని తొలగించడంలేదని చెబుతున్నారు. అయితే చిక్కడపల్లి, జవహర్‌నగర్, త్యాగరాయ గానసభ, వివేక్‌గర్, చిక్కడపల్లి గ్రంథాలయం ప్రాంతాల్లో సిబాబుల్ చెట్లు బాగా ఏపుగు పెరుగుతాయి.

◆ ఇటీవల చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం వద్ద పెద్ద సిబాబుల్ చెట్టు గాలి వర్షానికి కూలి విద్యుత్ వైర్లపై పడి 4గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హైడ్రా డీఆర్‌ఎఫ్ కరెంట్ సిబ్బంది వచ్చి గంటల పాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను, అవసరం లేని విరిగి, కూలిపోయే చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ భారీ చెట్టును తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని స్థానిక బస్తీవాసులు కోరుతున్నారు.


పుచ్చిపోయిన చెట్టు మొదలు


ప్రమాదకరంగా చెట్టు

### వృక్షాన్ని తొలగించాలి..



ఈ భారీ వృక్షం ఎప్పుడు కూలుతుందోననే భయం ఉంది. గత నెల 22న జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశాం. దీనిని తొలగించి మా ప్రాణాలు కాపాడాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– కిషోర్‌కుమార్, వివేక్‌నగర్ బస్తీవాసి

### సమస్యను పరిష్కారిస్తాం..



వివేక్‌నగర్ బస్తీ సమస్యను ఉద్యానవన , జీహెచ్‌ఎంసీ అధికారులకు విన్నవించాం. దీనిని తొలగించేందుకు తగిన చర్యలు చేపడుతాం. గతంలో వచ్చి కొన్ని భారీ చెట్టి కొమ్మలు కొట్టి వెళ్లారు. ఈ భారీ చెట్టు ప్రమాదకరంగా మారిన మాట వాస్తవమే. దీనిని తొలగించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటాం.

– పావని, గాంధీనగర్ కార్పొరేటర్

## ధోబీఘాట్‌లో వరదనీటి సమస్య పరిష్కారానికి చర్యలు


ధోబీఘాట్‌లో సహాయక పనులపై ఆరా తీసుస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్

**చిక్కడపల్లి:** ఆదివారం రాత్రి రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతాలైన ధోబీఘాట్‌లో సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితర ఆ పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటించారు. ధోబీఘాట్‌తో పాటు అశోక్‌నగర్, బాపునగర్, సబర్మతి నగర్, అరుంధతినగర్ బస్తీల్లో గాంధీనగర్ కార్పొరేటర్ వినయ్‌కుమార్ సూచనలు మేరకు వారు పర్యటించి స్థానికులను కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కార్పొరేటర్ పావనితో మాట్లాడిన వారు ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో మాట్లాడి సిబ్బందిని రప్పించి నీట మునిగిన ధోబీఘాట్‌లో వరదనీటిని తొలగింపజేశారు. అదే విధంగా అశోక్‌నగర్ వద్ద నిలిచిపోయిన వర్షపు వరద నీటిని హుస్సేన్‌సాగర్ నాలాలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయించారు. వరద వల్ల పేరుకుపోయిన చెత్తాచెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది ఎత్తివేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు వర్షంవల్ల ఏర్పాడిన కార్పొరేటర్ కార్యాలయ ఫోన్ నం.77998 19991 నంబర్‌లో సంప్రదించి సమస్యను తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆనంద్‌రావు, సాయికుమార్, ధోబీఘాట్ బస్తీవాసులు మల్లికార్జున్, అనిల్, నాగేష్, జహంగీర్, వెంకటేష్, నాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు వంశీ ఆర్ట్స్ ప్రెస్టీజ్ అవార్డ్



**చిక్కడపల్లి:** వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఇంటర్నేషనల్ శ్రీకృష్ణ స్వరరాగ స్రవంతి నిర్వహణలో సోమవారం వంశీ రామరాజు జన్మదిన వేడుకలను త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ఆయనకు స్వర్ణ కంకణం బహూకరించి సత్కరించారు. అనంతరం సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు వంశీ ఆర్ట్స్ ప్రెస్టీజ్ అవార్డ్‌తో సత్కరించారు. నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుల స్నేహబంధం ఉన్నతమైందని కేవీ రమణాచారి తెలిపారు. హాస్యం రాజేంద్రప్రసాద్‌ను కథానాయకుడి స్థాయికి చేరేలా చేసిందన్నారు. హాస్యభరిత పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారని తెలిపారు. 48 ఏళ్లుగా ప్రజల అభిమానాన్ని చూరగొంటూనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రేలంగి నరసింహారావు, వైఎస్‌రామకృష్ణ, సుధ, సుధామయి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటం కమ్యూనిస్టులదైతే ఆర్భాటం బీజేపీదా?

ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బీజేపీకి సంబంధం ఏమిటని ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి విమర్శించారు. పోరాటం కమ్యూనిస్టులదైతే ఆర్భాటం బీజేపీకి ఎందుకని ఆయన ప్రశ్నించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వాస్తవాలు – వక్రీకరణలు' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... మహోన్నత పోరాటంపై మతోన్మాదులు మాట్లాడే హక్కు లేదన్నారు. 1946 సెప్టెంబర్ 11 నుంచి 1951 సెప్టెంబర్ 17 వరకు జరిగిన సాయుధ పోరాటంలో మచ్చుకైన కనిపించని మతోన్మాదులు ఆ పోరాటానికి వారసులమంటూ సభలు పెట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 1913లో హిందూ మహాసభ, 1925లో ఆర్ఎస్ఎస్, 1951లో జన సంఘ్ ఏర్పడితే ఆ పోరాటం జరిగిన కాలంలో మీరేందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. నిజాం తెలుగు మాట్లాడకూడదు అని ఉర్దూ మాత్రమే ఉండాలని చెప్పినట్లుగానే నేడు బీజేపీ కూడా హిందీ మాత్రమే మాట్లాడాలని మాతృభాష మాట్లాడకూడదని చెబుతున్నారని ఆరోపించారు.

◆ సభకు అధ్యక్షత వహించిన కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ... వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ హైజాక్ చేస్తామంటే చరిత్ర క్షమించదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. నెహ్రూ, పటేల్ కలిసి కమ్యూనిస్టులను అణచివేయడానికి సైన్యాన్ని పంపారే తప్ప నిజాంకి వ్యతిరేకంగా కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, పార్థసారథి, ఉడుతల రవీందర్, నర్సింగరావు, కృపాసాగర్, బాలపీర్, సుబ్బారావు, మనోహర్, జి.రాములు, లక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేయాలి

కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా



**చిక్కడపల్లి:** కేంద్ర ప్రభుత్వ ఆస్పతులు, వైద్య కళాశాలల్లో మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేయాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ ఆర్డర్లను రద్దు చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ఫార్మా యాజమన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ గంగాధర్‌కు యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చికోటి శ్రీధర్, నేతలు రాజుభట్, నాగేశ్వర్‌రావు, దుర్గాప్రసాదరావు, విద్యాసాగర్, జి.శ్రీనివాస్, సదానందచారి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

**చిక్కడపల్లి:** వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, ఊంజల్‌సేవ, ఉట్టి కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ఈవో దేవనాథం, చైర్మన్ జానకి సుధాకర్, ధర్మకర్తలు పద్మావతి, శ్యామ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రైల్లో వృద్ధుడు అదృశ్యం


అరుణాచలం

**కాచిగూడ:** రైల్లో వృద్ధుడు అదృశ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అరుణాచలం (84) కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌సోల్ వెళ్లడానికి చెన్నైలో నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ట్రైన్ కాచిగూడకు వచ్చేసరికి అరుణాచలం ట్రైన్‌లో కనిపించకుండా పోయాడు. అరుణాచలం అన్న కుమారుడు నారాయణ కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**కాచిగూడ:** ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (65) ఉందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నం.4పైన అనారోగ్యంతో చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభ్యుదయ సాహిత్య యుగకర్త గురజాడ అప్పారావు



**చిక్కడపల్లి:** ఆధునిక భాషలో 'ముత్యాల సరాలు' రాసిన గురజాడ అప్పారావు నాటి భాషా పండితుల మెప్పు పొందారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. అభ్యుదయ సాహిత్య యుగకర్త గురజాడ అప్పారావు అని ప్రముఖ కవి సినారె తన పరిశోధన గ్రంథంలో పేర్కొన్న అంశాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సోమవారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమాల పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షతన జరిగింది.

## ప్రెస్ అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలి



కాచిగూడలో షోయబుల్లాఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు స్టాలిన్, యాదగిరి

**కాచిగూడ:** తెలంగాణ ప్రెస్ అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటాల వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం కాచిగూడలో సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షోయబుల్లాఖాన్‌ను చంపిన కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలు వేసి వారు నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలకు వ్యతిరేకంగా దొరలు, పటేల్, పట్వారీల భూస్వామ్య వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించారని అన్నారు. జరుగుతున్న పోరాటాన్ని ప్రతిబింబిస్తూ షోయబుల్లాఖాన్ తాజ్వీ పత్రికలో వ్యాసాలు ప్రచురించారని తెలిపారు. ఈ పత్రికపై అప్పట్లో నిజాం సర్కార్ కత్తిగట్టి నిషేధం పెట్టిందన్నారు. తర్వాత తన రయ్యత్ పత్రికలో ముస్లిం మేధావులను సమీకరించి వారి అభిప్రాయాలను ముద్రించారని తెలిపారు. దీంతో ఈ పత్రికపై సైతం నిషేధం కొనసాగిందన్నారు. చివరికి ఇమ్రోజ్ పత్రికకు ఎడిటర్‌గా ఉంటూ సర్కార్ అవలభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పౌర ప్రజాస్వామిక హక్కులు లేకుండా ఫత్వాలు జారీ చేస్తున్న పాలనపై తన రచనల ద్వారా కలానికి పదును పెట్టి ప్రజలను చైతన్యం చేశారన్నారు.

◆ ఇది నచ్చని నిజాం సర్కార్ షోయబుల్లాఖాన్‌ను బెదిరిపులకు గురి చేయడమే కాకుండా హత్య చేస్తామని హచ్చరించారన్నారు. అయినా బెదరకుండా నిండు గర్భవతిగా ఉన్న తన భార్య గురించి ఏ మ్రాతం ఆలోచించకుండా ధైర్యంగా నిజాం దాష్టీకాలపై వార్తలు ప్రచురించారని గుర్తుచేశారు. పత్రిక పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న షోయబుల్లాఖాన్‌ను కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో తన రెండు చేతులను నరికి హత్య చేశారని గుర్తుచేశారు. ఇలాంటి త్యాగల చరిత్ర కలిగిన షోయబుల్లాఖాన్ పేరును తెలంగాణ ప్రెస్ అకాడమీకి పెట్టి సముచితంగా గౌరవించుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు కాంపల్లి శ్రీనివాస్, మహ్మద్ సలీం, అరుట్ల రాజ్‌కుమార్, సీహెచ్ జంగయ్య, కళ్యాణ్, అనిల్, ధరంపురి గణేష్, ఐలయ్య, ఫహీం, సుశాంత్, భాను, అరవింద్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ పెంచని సీఎం రాజీనామా చేయాలి

వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్‌కమిటీ చైర్మన్ గోపాల్

**కవాడిగూడ:** గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను పెంచి ఇస్తామని చెప్పి ఇప్పుడు హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్ అన్నారు. దీనికి బాధ్యత వహించి సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామితో కలిసి డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేయూత, వికలాంగులు, వృద్ధులకు పెన్షన్ పెంచుతామన్న హామీని అమలు చేయాలనే డిమాండ్‌తో ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ నేత ఎల్.గోపాల్ మాట్లాడుతూ... చేయూత పెన్షన్‌దారులకు హామీ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైదని విమర్శించారు. పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అనేక రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి నాగేశ్వరరావు, ఇంజం వెంకటస్వామి, డప్పు మల్లికార్జున్ మాదిగ, ధనమ్మ, రవీందర్, సంజీవ, అమ్ముగూడెం, దశరథ్, శివప్రసాద్, రుద్ర, ఎల్లయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**హామీలు అమలు చేయాలంటూ ర్యాలీ..**

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ముషీరాబాద్ ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ కన్వీనర్ రాములు మాట్లాడుతూ... వికలాంగులకు రూ.6 వేలు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, శేఖర్, ఎల్లయ్య, తొట్ల గోపి, మధు, శ్రీను, నగేష్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్ తహసీల్దార్ రానా ప్రతాప్‌సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ నేతలు


ప్రేయర్ పవర్ చర్చ్ వద్ద నాలాలో చిక్కుకున్న వాహనాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులు


పార్శిగుట్ట వద్ద నాలాలోకి దిగి వెతుకుతున్న హైడ్రా సిబ్బంది


చెత్తాచెదారం తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఏఎంఓహెచ్ డా. ప్రవీణ

## దినేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

• దినేష్ నాలాలో కొట్టుకుపోవడం దురదృష్టకరం
• మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
• ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠాగోపాల్


దినేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

**ముషీరాబాద్:** వినోభానగర్‌లో వరద తాకిడికి నాలాలో కొట్టుకుపోయిన దినేష్ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద కుటుంబానికి చెందిన బాధితుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కా గృహం కేటాయించాలని కోరారు. స్థానికంగా నెలకొన్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులకు పలు మార్లు సూచించినా పట్టించుకోకపోవడం వల్లే సమస్య ఏర్పడిందని ఆరోపించారు. బాధితుని భార్య అతని తల్లిదండ్రులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు జార్జ్, శ్రీకాంత్ ముదిరాజ్, సత్యనారాయణబాబు, పూసగోరక్‌నాథ్, ఏయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది: ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్**

పేద కుటుంబానికి చెందిన దినేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. దినేష్ కుటుంబాన్ని పరామర్శించిన అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... దినేష్ నాలాలో కొట్టుకుపోవడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిత్యావసరాలను అందజేస్తామని పేర్కొన్నారు. అతని ఆచూకీ తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ముషీరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆర్ కల్పన యాదవ్, నియోజకవర్గం బి-బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు డి. వెంకటేష్, రాజ్‌దీప్, సంగపాక వెంకట్, నరేందర్, మురళీఘోజెస్ పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు..**

వినోభానగర్‌లో వరద ఉధృతి వల్ల స్థానికంగా ఉన్న 50 ఇళ్లలోకి వరద నీరు రావడంతో నిత్యావసరాలు, బట్టలు తడిచిపోయాయి. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్ రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు బియ్యం, పప్పు, నూనె తదితర సరుకులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహతో పాటు సీనియర్ నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్, తలారి శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు బాధితులకు నిత్యావసరాలను అందజేశారు.